ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
ఆదివారం 23 మార్చి 2025



నదుల కాలుష్యానికి కారణాలు

నదులంటే నిరంతరంగా ప్రవహించేవి కాకుండా వర్షాకాలంలో మాత్రమే భారీగా నీరు నిల్వ ఉండేవి ఉన్నాయి. వీటికి అనుబంధంగా ప్రాజెక్టులుంటున్నాయి. నదులు కలుషితం అయ్యేందుకు ప్రధానంగా మానవ తప్పిదాలే కారణంగా తెలుస్తోంది. నదీ తీర ప్రాంతాల్లో పరిశ్రమలు, వసతి ప్రదేశాల నుంచి వ్యర్థాలను నదులలోకి వదలడం, నదీ ప్రాంతాలను ఆక్రమించుకోవడం, మురుగునీటిని సంస్కరించకుండానే వదిలిపెట్టడం, ప్రజలు ఇళ్లలోని చెత్తను, మురుగును ఇతరత్రా వ్యర్థాలను, పశువుల మాంసాన్ని నదులలోకి వదలడం వంటివి ఉన్నాయి. శాస్త్రీయత లేకుండా ఇసుక తవ్వకాలు, చేపలు, తాబేళ్లను నాశనం చేయడం వంటివి మరో కారణాలుగా ఉన్నాయి. చేపలు, తాబేళ్ల సంతతి ఇటీవల గణనీయంగా తగ్గుతున్నట్లు తెలుస్తోంది. అందుకు ముఖ్యకారణం చేపలు గుడ్లు పెట్టి సంతతి పెంచుకునే ప్రదేశాలు నీరు కలుషితం కావడంతో మత్స్య సంపద పెరగడం లేదు. తాబేళ్లకు ఇదే పరిస్థితి ఏర్పడింది.


తుంగభద్రలోకి చేరుతున్న వ్యర్థాలు

జలం..గరళం..!

● రాష్ట్రంలో కలుషితమవుతున్న ప్రధాన నదులు ● 12 నదుల్లో నీరు తాగేందుకు అసాధ్యం ● వ్యాధులు ప్రబలుతున్నా మారని జనం ● యథేచ్ఛగా నీటిలోకి వ్యర్థాలు

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నదులు జీవనాడులు, దేశవ్యాప్తంగా కోట్లాదిమందికి తాగునీరు నదుల ద్వారానే అందుతోంది. దశాబ్దాల కాలంగా కాలుష్య నియంత్రణ మండలి నిర్లక్ష్యం చేయడం, రాజకీయ, అధికార పలుకుబడి తోడవ్వడం వంటి చర్యలతో నదీజలం విషపూరితంగా మారుతోంది. దేశంలో కలుషితం అవుతున్న నదుల సంఖ్య కోకొల్లలుగా ఉన్నాయి. రాష్ట్రంలో కలుషితమవుతున్న నదుల సంఖ్య 12కు చేరింది. రాష్ట్రప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన మేరకు నదుల్లోకి పట్టణాలు, నగరాలు, గ్రామాల మురుగునీరు, పరిశ్రమల వ్యర్థాలు చేరుతున్నాయి. నదుల్లో కలుషితమైన ప్రదేశం 693.75 కిలోమీటర్లుగా ఉన్నట్టు తేలింది. 112 ప్రదేశాలలో కలుషితనీరు నదులలోకి చేరుతున్నట్లు గుర్తించారు. వీటిని కట్టడి చేసే చర్యలు ఉదాసీనంగా సాగుతున్నాయి.

కలుషితమవుతున్న తుంగభద్ర

ఒకప్పుడు గంగా స్నాన, తుంగాపాన అనే నానుడి ఉండేది. గంగానదిలో స్నానం చేయడం పవిత్రమైనదని అదే రీతిన రాష్ట్రంలో సుదూరం ప్రవహించే తుంగానది నీరు తాగేందుకు సముచితమనేది దశాబ్దాలుగా భావించేవారు. ప్రస్తుతం తుంగానీరే అధికంగా కలుషితమయ్యింది. నీటిలో అల్యూమినియం అంశాలు పెరిగాయి. ప్రతి లీటరు నీటికి 0.03 నుంచి 0.063 దాకా అల్యూమినియం ఉండాలి. అయితే తుంగానదిలో 0.02 నుంచి 13.4శాతం ఉంది. ఇప్పటికే రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఈ నివేదికను ప్రకటించింది. తుంగా నది తరహాలోనే గంగాజలంలోనూ అల్యూమినియం శాతం పెరిగినట్లు ఇటీవల పలు నివేదికలు వెల్లడించాయి. దక్షిణకన్నడ జిల్లా శృంగేరి నుంచి ప్రారంభమయ్యే గూండు నది కూడా కలుషితమైంది. నీటిలో బయోకెమికల్ ఆక్సిజన్ ప్రతి లీటరుకు 0.5 నుంచి 1 మిల్లీగ్రాము దాకా ఉండాలి. అర్కావతి నది జలాల్లో 30 మిల్లి గ్రాములకంటే ఎక్కువ ఉంటోంది. తుంగభద్ర, భద్ర, శింషా నదులలో 6-10 మిల్లీగ్రాములు ఉంది. మిగిలిన 8 నదులలో 3-6 మిల్లిగ్రాముల దాకా బయోకెమికల్ ఆక్సిజన్ ఉంది. 2022-23 లో కేంద్ర కాలుష్యనియంత్రణ మండలి దక్షిణ పినాకిని, అఘనాశిని, శరావతి, గంగావళి నదులు కాలుష్య రహిత నదులుగా గుర్తించింది.

బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) శాతం ప్రతి లీటరుకు 0.5 నుంచి 1 మిల్లిగ్రాము ఉంటే తాగేందుకు సముచితమని సాంకేతికంగా పరిగణిస్తారు. అయితే 2-8 మిల్లీగ్రాములు ఉంటే స్వల్ప ప్రమాణంలో కలుషితంగాను, 8 ఎంజిలకంటే ఎక్కువ ఉంటే అత్యంత ఎక్కువ కలుషితంగా పరిగణిస్తారు. ఈ ప్రమాణంలో ఉన్న నీటిని తాగరాదని నిబంధనగా ఉంది. తుంగభద్ర, భద్ర, శింషా నదులలో 6-10 ఎంజిల బీఓడీ ఉండడంలో మనుష్యులు తాగేందుకు ఉపయోగించేందుకు వీలులేదు.

ఆరోగ్యంపై పెను ప్రభావం

జలమూలాల్లో అధిక బీఓడీ పెరగడం కారణంగా హానికరమైన బ్యాక్టీరియా వృద్ధి చెందుతోంది. తద్వారా రోగకారకాలు అధికమవుతాయి. కలుషిత నీరు తాగడం ద్వారా కలరా, టైఫాయిడ్, విరేచనాలు, హెపటైటీస్ వంటి రోగాలు ప్రబలుతాయి. అధికంగా పరిశ్రమలనుంచి వ్యర్థాలను, యాసిడ్ వంటి ప్రమాదకరమైన ద్రవాలను వదలడం ద్వారా నదులలోని కీటకాలు నాశనం కావడం, ఎక్కువనీరు సద్వినియోగానికి సాధ్యం కాని పరిస్థితికి చేరుతుంది. అధిక బీఓడీ ఉండే జలాల్లో మిథేన్ (సీహెచ్4), కార్బన్‌డై ఆక్సైడ్ (సీఓ2)లను విడుదల చేస్తుంది. ఇది పర్యావరణానికి తీరని ఆటంకంగా మారనుంది. జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో అందరిపైనా ఉంది.



అర్కావతి నదికి అనుబంధమైన హెసరఘట్ట ప్రదేశం ఇలా....

రాష్ట్రంలో కలుషితమైన నదులు ఇవే..

తుంగ, భద్ర, నేత్రావతి, కావేరి, అర్కావతి, లక్ష్మణతీర్థ, హేమావతి, కాగిన, కృష్ణ, శింషా, భీమనదులు ఉన్నాయి. కొడగు జిల్లా కావేరి నది ఉద్భవిస్తుంది. అక్కడనుంచి మైసూరు, మండ్య, చామరాజనగర జిల్లాల మీదుగా తమిళనాడువైపు ప్రవహిస్తోంది. కావేరి నదికి అనుబంధంగా కబిని, హేమావతితోపాటు పలు ఉపనదులు చేరుతాయి. కృష్ణ, భీమ నదులు మహారాష్ట్రలో పుట్టి ఉత్తర కర్ణాటక జిల్లాల మీదుగా ప్రవహిస్తాయి.

ద్వేషంతో వేటు వేయలేదు

● స్పీకర్ హోదానే అవమానపరిచారు
● బీజేపీ సభ్యుల్లో మార్పు రాకపోతే మరిన్ని చర్యలు
● విలేకరుల సమావేశంలో యూటీ ఖాదర్



బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలపై ఎటువంటి ద్వేషం లేదని, స్పీకర్ హోదాకు అవమానం చేయడాన్ని తట్టుకోలేకే 18మంది ఎమ్మెల్యేలపై వేటు వేసినట్లు స్పీకర్ యూటీ ఖాదర్ అన్నారు. విధాన సౌధలోని ఆయన చాంబర్‌లో శనివారం స్పీకర్ మీడియాతో మాట్లాడారు. సభ కంటే పెద్దది ఏదీ లేదన్నారు. స్పీకర్ స్థానానికి ఎవరైనా గౌరవం ఇవ్వాల్సిందేనన్నారు. ఓ వ్యవధి దాకా వేచి చూశానన్నారు. ఎవరి ఒత్తిడి లేదన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలచేత ఎన్నికై వచ్చారని, ఎలా వ్యవహరించాలో తెలుసుకోకపోతే ఎలాగన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఇలా రెండోసారి వ్యవహరించారన్నారు. తప్పు చేశామనే భావన వారిలో లేదని, సభ మరోసారి ప్రారంభమైనప్పుడు కూడా అదే తరహాలో వివాదం చేశారన్నారు. ఇప్పుడు శాసనసభలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో జిల్లాస్థాయి సభలలో ఇదే తరహాలో వ్యవహరిస్తే ఎలాగని ప్రశ్నించారు. న్యాయపోరాటం ఎమ్మెల్యేకు సంబంధించిన అంశమని, వారి నిర్ణయానికి మాట్లాడనన్నారు. ఇప్పుడు ఆరు నెలలు సస్పెండ్ అయ్యారని మరోసారి ఇదే తరహాలో కొనసాగితే ఏడాదిపాటు వేటు తప్పదన్నారు. ఇది ఎమ్మెల్యేలకు శిక్ష కాదని, భవిష్యత్తులో ఉత్తమ ప్రజాప్రతినిధులుగా ఉండాలన్నారు.

అవకాశం ఇచ్చినా వివాదమే..

ఇక హనీట్రాప్ విషయమై గురువారం బీజేపీ సభ్యుడు బసనగౌడపాటిల్ యత్నాళ్ నిలబడగానే అవకాశం ఇచ్చానన్నారు. హోం మంత్రితోపాటు మంత్రులు వివరణ ఇచ్చారన్నారు. సమగ్ర దర్యాప్తు కోరారన్నారు. అయినా మరుసటి రోజు కూడా అదే తరహాలో వివాదం సమంజసం కాదన్నారు. సీఎం సిద్దరామయ్యకు కాలి నొప్పి ఉన్నా ప్రతి విషయానికి ప్రతిపక్షాలు అడ్డుకోవడం సమంజసమేనా అన్నారు. ద్రవ్య వినియోగ బిల్లు పాస్ కారాదనే మనఃస్థితిని ఏమని అర్థం చేసుకోవాలన్నారు. ఎంత గందరగోళం చేసినా ఫైనాన్స్ బిల్లును ముగించామన్నారు. విధానసౌధకు ప్రత్యేక లైటింగ్ వ్యవస్థ కల్పించామని, వారాంతంలో రెండురోజులు ప్రత్యేకత ఉంటుందన్నారు. ఏప్రిల్ మొదటివారంలో సీఎం ప్రారంభిస్తారన్నారు. 99 గంటలపాటు కలాపాలు సాగాయన్నారు. గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ సమావేశాలకు సంబంధించి 99.34 గంటల పాటు కలాపాలు సాగాయని, పలు బిల్లులకు ఆమోదం లభించిందన్నారు. గవర్నర్ ప్రసంగంపై 14మంది సభ్యులు మాట్లాడారన్నారు. సాధారణ చర్చలో 80మంది సభ్యులు పాల్గొన్నారన్నారు. 2024 గ్రేటర్ బెంగళూరు అథారిటీ బిల్లు తదితర కీలక బిల్లులు ఈసారి సమావేశాల్లో ఆమోదం పొందాయన్నారు.

బబలాది మఠం స్వామీజీ అరెస్ట్

● బ్యాంకు అధికారుల సహకారంతో
రూ.60 లక్షలు ఖాతాలోకి మళ్లించినట్లు ఆరోపణలు


సదాశివ హిరేమఠ్

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాగల్కోట జిల్లా జమఖండిలో పేరొందిన హొసబబలాది మఠం స్వామీజీ సదాశివహిరేమఠ్ ముత్యాను సీఐడీ అధికారులు శనివారం అరెస్టు చేశారు. బెళగావి జిల్లా గోకాక్‌లోని మహాలక్ష్మి సహకారబ్యాంకులోని ఖాతాదారుల సొమ్మును కాజేశారన్న ఆరోపణల్లో అరెస్టు చేశారు. బ్యాంకుకు చెందిన పలువురు అధికారులు అక్రమంగా స్వామీజీ ఖాతాలకు నగదు బదిలీ చేశారు. అదే సొమ్ముతో స్వామీజీ ఓ ఇంటిని నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి. సదాశివహిరేమఠ్‌ను అరెస్టు చేసిన పోలీసులు శెహర పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ జరిపారు. ప్రాథమిక సమాచారం మేరకు రూ.60లక్షలకుపైగా మోసానికి పాల్పడినట్లు తెలుస్తోంది. సదాశివ హిరేమఠ్ కాలజ్ఞానం చెప్పడం ద్వారా గుర్తింపు పొందారు.

కలిసిరాని కన్నడ సంఘాలు..!

● రాష్ట్ర బంద్‌కు స్పందన అరకొరే ● యథావిధిగా బస్సులు, కార్యాలయాలు ● అడుగడుగునా పోలీసులు



కరవే కార్యకర్తలను తరలిస్తున్న పోలీసులు

బెంగళూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కన్నడ సంఘాల ఐక్యకూటమి బంద్‌ను అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. శనివారం ఉదయం నుంచే ప్రజాసంఘాలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాయి. అయితే ప్రజాజీవనానికి ఆటంకం కలిగించమని కన్నడసంఘాలు తెలిపిన విధంగానే వ్యవహరించాయి. బెళగావి నగరంలో ఇటీవల కేఎస్ఆర్టీసీ కండక్టర్‌ను మరాఠీలు మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటనపై కన్నడ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. దాదాపు నెలరోజులనుంచి బంద్ విషయమై కసరత్తు సాగించాయి. శనివారం ఉదయం కన్నడ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ నివాసంలో కీలకనేతలు భేటీ అయ్యారు. టౌన్‌హాల్ నుంచి ఫ్రీడంపార్కు దాకా ర్యాలీ చేస్తామని ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే సిద్ధమయ్యారు. నాయకులంతా టౌన్‌హాల్‌కు చేరుకున్నారు. అక్కడనుంచి ఫ్రీడంపార్కుకు పాదయాత్రగా బయల్దేరేందుకు సిద్ధం కాగా పోలీసులు అడ్డుకున్నారు. నాయకులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఫ్రీడంపార్కు వద్ద సభ నిర్వహించదలిచామని, అక్కడిదాకా ర్యాలీకి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే పోలీసులు ససేమిరా అన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న వాటాళ్ నాగరాజ్

దీంతో టౌన్‌హాల్ వద్ద జనం చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం నెలకొంది. దీంతో అందరినీ బస్సులో ఎక్కించి అక్కడనుంచి తరలించేందుకు ప్రయత్నించారు. వారందరినీ ఫ్రీడంపార్కు వద్దకు తీసుకురాగా తాము బస్సు దిగేది లేదని నిరసన తెలిపారు. మరోసారి అక్కడ ఉద్రిక్తతకు దారి తీసింది. ఇదే సందర్భంగా వాటాళ్ నాగరాజ్ మీడియాతో మాట్లాడుతూ మరాఠీలు ఇటీవలికాలంలో కన్నడిగుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతి విషయంలోనూ వివాదం చేస్తున్నారన్నారు. బెళగావిలో కన్నడిగులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మరాఠీలో మాట్లాడలేదని, కండక్టర్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన చోటు చేసుకుంటే బెళగావిలోనే తేల్చుకుంటామని సవాల్ విసిరారు. అప్పటికే మధ్యాహ్నమైంది. కర్ణాటక బంద్‌లో 35శాతంమంది ఆటో డ్రైవర్‌లతో వందలాది ప్రజాసంఘాలు నైతికంగా మద్దతు ఇచ్చాయి. ప్రజాజీవనానికి ఎక్కడా ఇబ్బంది కలగలేదు. బస్సులు, రైళ్లు, మెట్రో సంచారం యథావిధిగా కొనసాగాయి. ఇక బెళగావిలో కన్నడ సంఘాలు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొన్నాయి. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. మైసూరు, మంగళూరు, ఉడుపితోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కన్నడ సంఘాలు నిరసనలో భాగస్వామ్యులయ్యాయి. ఆఫీసులకు ఏ విధమైన ఇబ్బంది కలగలేదు.


ఎంజీ రోడ్డులో జన సంచారం

కూలిన రథాలు


కూలిన దొడ్డనాగమంగల రథం

రాయసంద్రలో..



దొమ్మసంద్ర/బొమ్మనహళ్ళి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రథోత్సవంలో అపశ్రుతి నెలకొంది. ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళిలో పేరొందిన హుస్కూరు మద్దూరమ్మ జాతరకు చుట్టుపక్కల 15-20 గ్రామాల వారు వేర్వేరుగా రథాలు తీసుకురావడం ఆనవాయితీ. ఈ ఏడాది ఐదు గ్రామాలవారు రథాలను సిద్ధం చేశారు. దొడ్డనాగమంగల, రాయసంద్రలకు చెందిన రెండు రథాలు శనివారం హుస్కూరుకు వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాయి. ఒక్కో రథం 22 అంతస్తులతో సుమారు 140-150 అడుగుల ఎత్తుతో ఉన్నాయి. బలమైన ఈదురుగాలులు వీయగా ఒక మోస్తరు వర్షం కురిసింది. అలాగే రథాన్ని ఊరేగించారు. దీంతో అదుపుతప్పి రెండు రథాలు వేర్వేరు ప్రదేశాలలో నేలకొరిగాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కల్యాణ కర్ణాటకలో ఉరుములు, మెరుపులు..


విజయనగరంలో జోరుగా కురుస్తున్న వాన

బళ్లారి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు, బీదర్, యాదగి(కల్యాణ కర్ణాటక) జిల్లాలో శనివారం కొన్ని చోట్ల భారీ వర్షం, మరి కొన్ని చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. కొప్పళ, యాదగిరి. బీదర్ జిల్లాలో పిడుగులతోపాటు భారీ వాన కురిసింది. విజయనగర, బళ్లారి జిల్లాల్లో కొన్ని తాలూకాల్లోని గ్రామాల్లో శనివారం సాయంత్రం వరకూ తేలిక పాటి జల్లులు కురిశాయి. కొప్పళ జిల్లాలో హనుమాన్ సాగ్ సమీపంలో పిడుగులు పడ్డాయి. ఇంటి ఆవరణంలో ఉండే ఒక కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు దగ్ధం అయ్యింది. ఒకటి, రెండు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. ఓ పక్క వేసవి ఎండలతో ఉసూరుమంటున్న జనానికి ఈ వానలు కాస్త ఊరటనిచ్చాయి. నాలుగో శనివారం సెలవు, పైగా కర్ణాటక రాష్ట్ర బంద్ నేపథ్యంలో ప్రజలు పెద్దగా బయట కనిపించలేదు.


కొప్పళ్లలో పిడుగు పడి దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.47 (ఆదివారం సాయంత్రం)
సెహరీ : 5.09 (సోమవారం ఉదయం)

వర్షంతో దెబ్బతిన్న పంటలు


చింతామణిలో కురుస్తున్న వర్షం

చింతామణి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణం, తాలూకా వ్యాప్తంగా శనివారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు గంటకుపైగా వర్షం కురవగా కొన్ని చోట్ల 20-40 నిమిషాల మేర వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచే మేఘావృతం కాగా 3గంటలకు ప్రారంభమైన వర్షం ఉరుములు మెరుపులతో సుమారు గంటపాటు కురిసింది. పట్టణంలోని బంబూబజార్ సర్కిల్ నుంచి నగరసభ అర్బాయ్ కార్యాలయం వరకు రోడ్డుపై నీరు నిలిచింది. పాదచారులు, ద్విచక్రవాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. కొద్దిరోజులుగా ఎండవేడిమి అధికంగా ఉండగా శనివారం కురిసిన వర్షంతో ఉపశమనం అనిపించింది. అయితే పలువురు రైతులు మాత్రం అకాలవర్షంతో రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

వడగండ్లతో పంటలకు నష్టం

తాలూకాలో కొన్ని చోట్ల వడగండ్లతో కూడిన వర్షం కురవడంతో పలు పంటలకు నష్టం వాటిల్లింది. ప్రత్యేకించి కంగానహళ్ళి సమీపంలో నెట్ హౌస్‌ల కింద సాగు చేస్తున్న క్యాప్సికమ్ పంట దెబ్బతింది. దీంతో లక్షలాదిరూపాయల నష్టం వాటిల్లినట్టు రైతు శివశంకరరెడ్డి వాపోయాడు. కాగా అంబాజిదుర్గ హోబళి కంగానహళ్ళి ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం జరగనుంది. జాతర నేపథ్యంలో ఆలయం సమీపాన పలువురు వ్యాపారస్తులు టెంట్‌లు సిద్ధం చేసుకుంటున్నారు. వర్షం కురవడంతో సామగ్రి నీటిపాలైంది.


కంగానహళ్ళిలో దెబ్బతిన్న క్యాప్సికమ్ పంట

ఆగిన పల్లె పండుగ..!

- బిల్లులు రాక నిలిచిన పనులు
- సీసీ రోడ్లవే రూ. 2.64 కోట్లు పెండింగ్
- అసంపూర్తిగా గోకులాలు
- నిధులు రాక కాంట్రాక్టర్ల లబోదిబో



కొళగాన హళ్లిలో నిర్మించిన సీసీరోడ్డు

బొమ్మనహాళ్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులు ఆలస్యం అయ్యాయి. గోకులాల షెడ్లను సొంత నిధులతో ప్రారంభించిన రైతులు కూడా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. మండలానికి రూ. 3.51 కోట్లతో 83 పనులు మంజురయ్యాయి. ఇందులో 82 పనులను పూర్తి చేశారు. గోనేహాళ్ గ్రామంలో ఒక రోడ్డు మాత్రమే పెండింగ్‌లో ఉంది. మండల వ్యాప్తంగా సీసీ రోడ్లకు సంబంధించి రూ. 2.64 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నా యి. ఈ పనులకు ఉపాధి హామీ పథకం నుంచి నిధులు కేటాయిం చారు.

ఆగిన గోకులాలు

రెండునెలలుగా బిల్లులు రాకపోవడంతో గోకులాల షెడ్ల నిర్మాణం ఆపేశారు. సీసీ రోడ్లకు సంబంధించి ఒక్కో పనిని రూ. 3 లక్షల వరకు విభజించి నామినేషన్ ప్రాతిపదికపై కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీరంతా చిన్నాచితకా



బొమ్మనహాళ్‌లో అసంపూర్తిగా ఉన్న గోకులం షెడ్డు

కాంట్రాక్టర్లు కావడంతో బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. పనులను ఒత్తిడితో పూర్తి చేయించారని బిల్లులు ఇవ్వడంలో అలస్యం చేస్తున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులకు సంబంధించి ఉపాధి హామీ పనుల ద్వారా సమకూరే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వెచ్చిస్తున్నారు. ఈ నిధులు 75 శాతం కేంద్రం, మిగిలిన 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి కొంత జాప్యం కావచ్చు అని అధికారులు అంటున్నారు.

రూ.4.22 కోట్ల అంచనాలతో పనులు..

రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరు 14 నుంచి పల్లె పండుగ పేరుతో అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఉపాధి హామీ పథకానికి సంబంధించి మెటీరియల్ కాంపోనెట్, ఆర్థిక సంఘం నిధులు ద్వారా బిల్లులు చెల్లించే విధంగా పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ సీసీ రోడ్లు అవసరమో గుర్తించి వాటిని నిర్మించడానికి వీలుగా అంచనాలు సిద్ధం చేసి పంపించారు. రైతుల కోసం గోకులాల షెడ్లను ఈ పథకంలో చేర్చారు. సీసీ రోడ్లు, గోకులాలు షెడ్లకు సంబంధించి మండలంలో రూ.4.22 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. ఇందులో ఇప్పటి వరకు రూ. 85 లక్షలు బిల్లులు మాత్రమే చెల్లించారు. కానీ పూర్తయినా మధ్యలో కొనసాగుతున్న పనులకు సంబంధించి ఇంకా రూ. 3.35 కోట్లు వరకు బకాయిలు పేరుకుపోయాయి. డిసెంబరు నెలాఖరు వరకు వారం వారం వచ్చిన బిల్లులు ఆ తర్వాత నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లు మాత్రం రోడ్లను పూర్తి చేశారు. రైతులు మాత్రం గోకులాలను అర్ధంతరంగా నిలిపివేశారు. బిల్లులు వస్తేనే తిరిగి చేయగలమంటూ అధికారులకు తెగేసి చెప్పేస్తున్నారు. మండల వ్యాప్తంగా 31 గోకులాలు మంజూరు కాగా 12 మాత్రమే పూర్తి అయ్యాయి.

బిల్లులు అప్‌లోడ్ చేశాం



మండలంలో పల్లె పండుగలో భాగంగా రూ. 3.51 కోట్లతో 83 రోడ్లు మంజురు కాగా 82 పూర్తి చేశాం. గోనేహాళ్ గ్రామంలో మాత్రమే ఒక రోడ్డు పెండింగ్ లో ఉంది. రూ. 85 లక్షలు వరకు బిల్లులు చెల్లించాం. రూ. 2.64 కోట్లు రావాల్సి ఉంది. పెండింగ్ బిల్లులు మొత్తం అప్‌లోడ్ చేశాం.

- జగదీష్, జేఈఈ, పంచాయతీరాజ్, బొమ్మనహాళ్

రైతు ఆత్మహత్యాయత్నం

సర్వేయర్ బెదిరింపులే కారణమా..?



బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు

బత్తలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విలేజ్ సర్వేర్ బెదిరించాడని మండలంలోని దంపేట్ల గ్రామానికి చెందిన నారాయణస్వామి శనివారం పు రుగులు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు తెలిపిన మేరకు దంపేట్ల గ్రామానికి చెందిన నారాయణ స్వామికి అదే గ్రామములో సర్వే నెంబర్ 348లో 2.4 ఎకరాల పొలం ఉంది. అందులో బోరు వేసుకుని మొక్కజొన్నసాగు చేశాడు. నారాయణస్వామి శనివారం తన పొలానికి కంచె వేస్తుండగా సర్వేర్ రవి కిరణ్ ఫోన్ చేసి నువ్వు కంచె వేస్తే పోలీస్ కేసు పెట్టి నీకు భూమి లేకుండా చేస్తానని బెదిరించాడు. ఎందుకు వేయకూడదు అని ప్రశ్నించగా బోరుబావి ఉన్నప్రాం తం వేరే రైతుకు పోతుంది అని సర్వేయర్ చెప్పాడు. దీంతో రైతు ఇప్పటికే 5సార్లు కొలతలు వేశారు. నాభూమిలో ఉన్న బోరు వేరేవాళ్లకు పోతే నేను ఎలా బతకాలి నాకు చావే శరణ్యం అంటూ పురుగుల మందు తాగా డు. గమనించిన తల్లి సంజ మ్మ, చుట్టు పక్కల రైతుల సాయంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లి విచారించగా బెంగళూరుకు తరలించినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారని ఎస్ఐ సోమశేఖర్ తెలిపాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదన్నారు. విలే జ్ సర్వేయర్ అనవసరంగా సమస్య లు సృష్టించి డబ్బు లు డిమాడ్ చేస్తున్నాడని గ్రామస్థులు ఆ రో పిం చారు.

ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

అనంతపురం-ఉరవకొండ రహదారిలో తరచూ ప్రమాదాలు

- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- వాహనాల వేగ నియంత్రణకు చర్యలేవీ?



కమ్మూరు వద్ద రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఆటో (ఫైల్)

కూడేరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. తరచూ ప్రమాదాలు జరిగి.. ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. పలువురు తీవ్రంగా గాయపడి మంచాలకే పరిమితమవుతున్నారు. ప్రమాదాలకు నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రధాన కారణమని పోలీసుల విచారణలో తేలుతోంది. అతివేగంతో వాహనాలు దూసుకొస్తున్నాయి. అదుపు చేయలేక ఢీకొంటున్నట్లు ప్రమాదాల తీరును బట్టి తెలుస్తోంది. అయినా వాహనాల వేగ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించట్లేదు.

ప్రమాదకర మలుపులు

అనంతపురం నగర శివార్ల నుంచి పెన్నహోబిలం వరకు 30 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ ప్రాంతంలోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మండలంలోని బ్రాహ్మణపల్లి, కమ్మూరు, అరవకూరు చెరువుకట్ట, కూడేరు సమీ పంలోని శివా రె డ్డి తో ట, ముద్దలాపురం, జల్లిపల్లి, ఉదిరిపికొండ, శివరాంపేట గ్రామాల వద్ద మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. కూడేరు, ముద్దలాపురం మధ్యనున్న శివారెడ్డి తోట వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పోలీసులు ఆ ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. ఒకేచోట రెండు, అంత కంటే ఎక్కువ ప్రమాదాలు జరిగితే పోలీసులు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు సూచికలు ఏర్పాటు చేస్తారు. ఈ రహదారిలో ఏకంగా 8 ప్రమాదకర మలుపులను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు.



ఉదిరిపికొండ గ్రామం వద్ద మలుపు

ఇటీవలి రోడ్డు ప్రమాదాల్లో కొన్ని..

- 2023వ సంవత్సరంలో కమ్మూరు గ్రామ సమీపంలోని ఐశ్వర్య వెంచర్ వద్ద ద్విచక్రవాహనంలో వస్తున్న ముగ్గురు యువకులు దున్నపోతును ఢీకొన్నారు. ఇద్దరు మరణించారు.
- ముద్దలాపురం గ్రామ సమీపంలోని శివారెడ్డి తోటవద్ద ద్విచక్రవాహనం, బస్సు ఢీకొనడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.
- 2024 అక్టోబరులో శివరాంపేట సమీపంలోని క్రాస్ వద్ద ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంలో వెళ్తూ కారును ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు.
- ఈ నెలలోనే కమ్మూరు గ్రామ సమీపాన ఆటోను కారు ఢీకొట్టడంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లతోపాటు, మూడు నెలల చిన్నారి మృతి చెందారు. ఈ ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై వాహనాలు వేగంగా వస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకిరువైపులా గ్రామాల్లో ప్రజలు, విద్యార్థులు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంతోపాటు కమ్మూరు, అరవకూరు, ముద్దలాపురం, ఉదిరిపికొండ, శివరాంపేట తదితర గ్రామాల్లో స్పీడ్ బ్రేకర్లు వేయాలి. వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలి. మలుపులు అధికంగా ఉన్న ప్రదేశాల్లో ప్రమాద సూచికలతోపాటు వేగం తగ్గించే చర్యలు తీసుకోవాలి.

- కృష్ణమూర్తి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రమాదాల నియంత్రణకు చర్యలు



అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నాం. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే కఠినంగా వ్యవహరిస్తాం. రోజూ వాహన తనిఖీలు చేపడుతూ అవగాహన కల్పిస్తున్నాం. ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణే లక్ష్యం.

- రాజు, సీఐ, కూడేరు అప్‌గ్రేడ్ స్టేషన్

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 120 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.

శరవేగంగా విస్తరణ

గుంతకల్లు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రకటించిన విధంగానే హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రారంభించింది. నీటి ఎత్తిపోతలు నిలిచిన వెంటనే ఈ పనులను ప్రారంభించేలా ప్రభుత్వం జలవనరుల శాఖను సమాయత్తపరిచింది. మరో 20 రోజులపాటు నీటిని పారించే అవకాశం ఉన్నా, పంటలన్నీ పూర్తికావడంతో ఎత్తిపోతలను గత వారంలో నిలిపివేసింది. విస్తరణ పనులను జగన్ ప్రభుత్వం ఐదేళ్లపాటు నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీనీవా కాలువను వెడెల్పు చేస్తామని, పూర్తి స్థాయిలో సాగునీటిని పారిస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా పనులకు శ్రీకారం చుట్టారు. జూన్ 12 నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగాముందుకు సాగుతున్నారు.

ఇదీ నేపథ్యం.. కర్నూలు జిల్లా మల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయరు వరకూ 216 కి.మీ. హంద్రీనీవా కాలువను వెడెల్పు చేస్తామని 2017లో పామిడిలో ఏర్పాటుచేసిన సభలో చంద్రబాబు ప్రకటించారు. అప్పట్లో 90 రోజుల వ్యవధిలో పనులు పూర్తయ్యేలా టార్గెట్ ఇచ్చినా సాధ్యపడలేదు. 2019 ఎన్నికల నాటికి మట్టిపనులు 50 శాతం పూర్తికాగా, మట్టికట్టలు, సిమెంటు లైనింగ్ పనులను చేపట్టలేకపోయారు. ఆ ఎన్నికల్లో వైసీపీ గెలవడంతో పనులు అటకెక్కాయి. హంద్రీనీవా కాంట్రాక్టులన్నింటినీ జగన్ రద్దు చేయించారు. 2023లో లైనింగ్‌తో వైడెనింగ్ చేపడతామని ప్రకటించి టెండర్లు నిర్వహించారు. కానీ పనులు చేపట్టలేదు. 2024 ఎన్నికల అనంతరం చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే వైడెనింగ్‌కు కసరత్తు ప్రారంభించారు. ప్రాజెక్టు నిర్మించినప్పుడు లక్ష్యంగా ఉన్న 3,850 క్యూసెక్కుల నీరు పారేలా వెడెల్పు చేయడానికి అంచనాలు వేయించారు. రూ.400 కోట్లతో టెండర్లను నిర్వహించారు. వీపీఆర్ సంస్థ పనులను దక్కించుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగమేఘాలపై పనులకు శ్రీకారం చుట్టింది

90 రోజుల టార్గెట్ వచ్చే ఖరీఫ్ ఆరంభమయ్యేలోగా విస్తరణ పనులు పూర్తి కావాలన్న లక్ష్యంతో కాంట్రాక్టు సంస్థ రంగంలోకి దిగింది. మల్యాల నుంచి జీడిపల్లి రిజర్వాయరు వరకూ 216 కి.మీ. మేర అడుగడుగునా మిషనరీని దించి కార్యాచరణ చేపట్టింది. గ్రావిటీ కంటే కింద నీరు పారేచోట కాలువ పనులు ఆలస్యమైనా ఫర్వాలేదు, నేలకు సమాంతరంగా నీరు పారే చోట్ల నిర్మించిన మట్టికట్ట పనులు ఎట్టిపరిస్థితుల్లోనూ 90 రోజుల్లో పూర్తిచేయడానికి రంగం సిద్ధంచేశారు. జిల్లాలో హంద్రీనీవాకు కసాపురం, జీ కొట్టాల, రాగులపాడు పంప్ హౌస్ వద్ద, ఎన్ఎస్‌పీ తాండా సమీపంలో ఉన్న మట్టికట్టల తొలగింపు కార్యక్రమాన్ని తొలుత చేపట్టారు. భూమికి సమాంతరంగా నీరుపారే చోట్ల మట్టికట్టలను తొలగించిన తర్వాత పనులు పూర్తికాకపోతే హంద్రీనీవాలో నీరు పారడం సాధ్యంకాదు. కనుక మట్టికట్టల పనులను తొలుత చేపట్టి, త్వరగా పూర్తిచేయడానికి చర్యలు చేపట్టారు. హంద్రీనీవా కాలువ కుడి గట్టు (ఉత్తరం వైపు గట్టు) మాత్రమే తొలగించి కాలువను వెడెల్పు చేసే పనులను ప్రారంభించారు. మార్కింగ్ చేయడానికి తొలుత జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. కసాపురం సమీపంలో కాలువ గట్లపై కంప చెట్లను తొలగించడం పూర్తికావడంతో ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ ఇవ్వగా బండ్ తొలగింపును ప్రారంభించారు. జి.కొట్టాల తదితర ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ జరుగుతోంది.

వేగంగా డీ వాటరింగ్ నీటిపారుదల ఆగిపోయినా రాగులపాడు పంప్‌హౌస్ నుంచి దిగువకు నీరు నిలిచి ఉంది. ఆ నీటిని తరలిస్తే తప్ప గట్టును తొలగించడానికి సాధ్యపడదు. దీంతో నిల్వ ఉన్న నీటిని తోడే పనులను చేపట్టారు. కసాపురం తూముకు సమీపంలో కుడి వైపు గట్టును తెంచి నీటిని వంకలోకి వదులుతున్నారు. జి.కొట్టాల వద్ద మోటార్లను బిగించి నీటిని బయటకు తోడేస్తున్నారు. కసాపురం వద్ద జంగిల్ క్లియరెన్సు, డీవాటరింగ్ పూర్తి కావడంతో ఎక్స్‌కవేటర్లతో బండ్ షిఫ్టింగ్ చేపట్టారు. ప్రస్తుతం కాల్వ 9.5 అడుగుల బెడ్ ఉండగా, దాన్ని కొన్ని చోట్ల అదనంగా 6 అడుగుల వెడెల్పు, మరికొన్ని చోట్ల అదనంగా 8 అడుగుల వెడెల్పుచేస్తారు. వంతెనలు, స్లూయిజ్ చానల్ స్ట్రక్చర్స్ ఉన్నచోట్ల కాలువను వెడెల్పు చేయరు. 2005లో హంద్రీనీవాను 3,850 క్యూసెక్కుల నీరు పారేలా డిజైన్ చేశారు. కానీ కాలువ సామర్థ్యం అందుకు తగినవిధంగా లేదు. విస్తరణ పనులు పూర్తయితే.. పూర్తి సామర్థ్యంతో నీరు పారుతుంది.

నదిలోకి నిధులు..!

వైసీపీ హయాంలో స్వాహాపర్వం

ఇది పామిడి-కల్లూరు మధ్య పెన్నానదిపై నిర్మించిన వంతెన. టీడీపీ హయాంలో రూ.48లక్షలతోనే మూడో కాలువపై ఈ వంతెన నిర్మించారు. సైడ్ వాల్స్ నాణ్యంగా కట్టారు. 2022లో పెన్నానదిలో వరద ఈ వంతెన మీదుగానే ఉధృతంగా ప్రవహించినా ఏమాత్రం చెక్కుచెదరలేదు.



- పెన్నానది వంతెనల మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలు
- సైడ్ వాల్స్ కట్టకుండా దిమ్మెలతో సరి..
- అవి కూడా.. పడిపోయిన దుస్థితి
- రెండు వాహనాలు ఒకేసారి వెళ్లడానికి ఇబ్బంది
- ఎదురుగా వాహనం వస్తే బెంబేలెత్తుతున్న ప్రయాణికులు
- ప్రమాదపుటంచున ప్రయాణాలు
- తరచూ ప్రమాదాలు

ఇది పామిడి-కల్లూరు మధ్య పెన్నానదిపై ఉన్న వంతెన. 2022లో నదికి భారీ వరద రావడంతో నదిలోని ఈ రహదారిలో రెండు వంతెనలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం రెండు వంతెనల మరమ్మతులు, రోడ్డులో అక్కడక్కడా ప్యాచ్ వర్కులు చేసింది. ఇందుకోసం ఏకంగా రూ.3.15 కోట్లు ఖర్చు చేసింది. వంతెనల కింద పిల్లర్లకు కనీసం ప్లాస్టింగ్ కూడా చేయలేదు. రోడ్డుపై చేసిన ప్యాచ్ వర్కులు అప్పుడే దెబ్బతిన్నాయి. ఈలెక్కన నాసిరకంగా పనులు చేశారని స్పష్టమవుతోంది. కోట్ల రూపాయల నిధులు ఏం చేశారో, ఎవరు కాజేశారో అంతుచిక్కని విషయంగా మారింది.





పామిడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామిడి-కల్లూరు మధ్య పెన్నానదిపై ప్రయాణమంటే వాహనదారులు హడలెత్తుతున్నారు. వంతెనలు మరీ ఇరుకుగా ఉన్నాయి. ఎదురుగా వాహనం వచ్చిందంటే దాటుకోవడం చాలాకష్టం. కనీసం అంచుల్లో సైడ్‌వాల్స్ కూడా లేవు. అక్కడక్కడా పిల్లర్లు కట్టినా వాటిలో చాలావరకు ధ్వంసమయ్యాయి. దీంతో అంచుల్లో వాహనదారులు ఏమాత్రం ఆదమరచినా ప్రమాదం తప్పదు. భయంభయంగా ప్రయాణిస్తున్నారు. వైసీపీ హయాంలో చేపట్టిన వంతెనల మరమ్మతు పనులు కాంట్రాక్టర్‌కు కాసుల వర్షం కురిపించినా.. ప్రయాణికులకు మాత్రం ప్రాణసంకటంగా మారాయి. తూతూమంత్రంగా పనులు చేపట్టి రూ.కోట్లాది ప్రజాధనాన్ని దోచుకున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పెన్నానది వంతెనలపై ప్రమాదాల పాపం వైసీపీదేనని దుమ్మెత్తిపోస్తున్నారు.

పెన్నానదిలో ప్రమాదానికి గురైన కారు



ప్రమాదాల ప్రయాణం

పామిడి-కల్లూరు (బీసీసీ రోడ్డు) పెన్నానదిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి నెలా ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. అయినా వాటి నివారణకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకున్న పాపానపోలేదు. 2022లో వర్షాలకు పెన్నానది ఉధృతంగా ప్రవహించింది. దీంతో పామిడి-కల్లూరు (బీసీసీ రోడ్డు) ప్రధాన రహదారి పెన్నానదిలోని వంతెనలు శిథిలమయ్యాయి. రోడ్డు ఛిద్రమైంది. పెన్నానదిలోని వంతెనలు, రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ అత్యవసర నిధులు రూ.3.15కోట్లు మంజూరు చేశారు. శిథిలమైన వంతెనల వద్ద బెడ్డింగ్ వేసి, పైపులు అమర్చేందుకు ఎనిమిది నెలలు పట్టింది. రోడ్డుపై అక్కడక్కడా ఏర్పడిన గుంతలపై తారుతో ప్యాచ్ వర్క్ చేసి, చేతులు దులుపుకున్నారు. ఆ ప్యాచ్ వర్కులు మూడు నెలలకే దెబ్బతినడం గమనార్హం. బెడ్డింగ్ వేసి పైపులను అమర్చి ఆ రోడ్డుపై మొక్కుబడిగా దూరదూరంగా సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల ఏమాత్రం భద్రతా చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతపెద్ద వంతెన, రోడ్డుకు భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలో ఓ ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. ఈ రోడ్డులో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం తప్పదని జనం బెంబేలెత్తుతున్నారు.

ప్రమాదకరంగా పామిడి పెన్నానది వంతెన




కాంట్రాక్టర్లకు కల్పతరువు

పామిడి-కల్లూరు మధ్య (బీసీసీ రోడ్డు) పెన్నానది వంతెనలు కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారాయని, ఇందుకు వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన మరమ్మతులే నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. వరదనీటి ప్రవాహానికి వంతెనలు పటుత్వం కోల్పోయాయి. వంతెనల కింద ఉన్న రాళ్ల దిమ్మెలు నెర్రెలు ఇచ్చాయి. వంతెనల్లో పలుచోట్ల ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్త పేరుకుపోయింది. పలుచోట్ల పూర్తిగా మట్టితో మూసుకుపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో ఈ వంతెనలు.. కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపించాయని ప్రజలు బాహాటంగా చెబుతున్నారు. ఇంత అధ్వానంగా ఉన్న వంతెనలకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడం శోచనీయం. వరద వస్తే.. మళ్లీ ఛిద్రమవుతాయని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. పెన్నానదిలో వంతెనల భద్రతను గాలికి వదిలేయకుండా ఈ వేసవిలో పటిష్ఠ పరచాలనీ, మరోసారి ప్రజలు, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తలారి వెంకటేష్ (ఫైల్)

వంతెన పనులపై విచారణ చేపట్టాలి



హమాలీ గోపాల్, పామిడివైసీపీ ప్రభుత్వంలో రూ.3.15 కోట్లతో చేపట్టిన పామిడి-కల్లూరు పెన్నానది (బీసీసీ రోడ్డు) వంతెన పనులపై విచారణ చేపట్టాలి. టీడీపీ హయాంలో రూ.48లక్షలతోనే మూడో కాలువ వంతెన నిర్మాణం చేపట్టారు. 2022లో పెన్నానదిలో వరద ఈ వంతెన మీదుగానే ఉధృతంగా ప్రవహించినా ఏమాత్రం చెక్కుచెదరలేదు. వైసీపీ ప్రభుత్వంలో రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించినా కనీసం వంతెనల కింద ఉన్న రాళ్ల దిమ్మెలకు ప్లాస్టింగ్ కూడా చేయలేదు. రోడ్డుకు ఇరువైపులా సక్రమంగా సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేయలేకపోయారు. కొన్ని వంతెనలపై వాహనాలు వస్తే పాదచారులు పక్కన నిలబడలేని పరిస్థితి ఉంది. ఈ పనులపై విచారణ చేపట్టాలి.

- హమాలీ గోపాల్, పామిడి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

భగత్‌సింగ్ (వర్ధంతి)




స్వాతంత్ర్య సంగ్రామంలో 'విప్లవం వర్ధిల్లాలి' అనే నినాదంతో ప్రజలను చైతన్యం చేసిన భగత్ సింగ్ 1907 సెప్టెంబరు 28న పంజాబ్‌లోని బంగా ప్రాంతంలో జన్మించారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో ఢిల్లీ వీధులలో ఎర్రకాగితాలు చల్లి ప్రజలను చైతన్యం చేశారు. నవజవాన్ భారతసభ, హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్ సంస్థల ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. ఉర్దూ, పంజాబీ పత్రికలకు పలు రచనలు అందించారు. 23వ యేట 1931 మార్చి 23న ఉరి తీయబడ్డారు. 1968లో కేంద్రప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది.

కిరణ్ మజుందార్ షా (పుట్టినరోజు)



బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న బయోకాన్ సంస్థ ఛైర్ పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న 'పద్మభూషణ్' గ్రహీత కిరణ్‌మజుందార్ షా 1953 మార్చి 23న పూనెలో జన్మించారు. ఐఐఎంకు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఓత్మెర్ గోల్డ్ మెడల్ ఇతర పురస్కారాలు పొందారు. యునైటెడ్ స్టేట్స్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 2019లో సభ్యురాలిగా పొందిన తొలి భారతీయ మహిళ. సంస్థ సామాజికసేవలో భాగంగా ఆరోగ్య, విద్య, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రత్యేకత చాటుకున్నారు. 2019లో ఫోర్బ్స్ జాబితాలో ప్రపంచంలో శక్తి వంతమైన మహిళల్లో 68వ స్థానంలో నిలిచారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో సేవలకు 2022లో హెచ్‌కే ఫిరోదా జీవిత సాఫల్య పురస్కారం, పలు జాతీయ, అంతర్జాతీయ గౌరవాలు అందుకున్నారు. 2024లో కంకార్డియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు.

శ్రీకాంత్ (పుట్టినరోజు)



టాలీవుడ్‌లో పేరొందిన నటుడు శ్రీకాంత్ 1968 మార్చి 23న కర్ణాటక రాష్ట్రం కొప్పళ్ జిల్లా గంగావతిలో జన్మించారు. తెలుగు సినిమా నటుడు. 120కుపైగా సినిమాలలో నటించారు. 'మహాత్మా'కు నంది స్పెషల్ జ్యూరీ అవార్డు, 'శంకర్ దాదా ఎంబిబిఎస్'కు ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ అవార్డు, 'సరైనోడు'కు సైమా అవార్డ్ ఫర్ బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ తదితర పురస్కారాలు అందుకున్నారు. సినీ నటి ఊహను వివాహం చేసుకున్నారు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌లోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు.

స్మృతి ఇరాని (పుట్టినరోజు)



స్మృతి జుబిన్ ఇరాని 1976 మార్చి 23న న్యూ ఢిల్లీలో జన్మించారు. బీజేపీలో క్రియాశీలకంగా ఉన్నారు. కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగాను, మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రిగాను వ్యవహరించారు. కేంద్రమంత్రిగా వివిధ శాఖల్లో పని చేశారు. రాజకీయాల్లోకి రాకముందు ఆమె తొలుత మోడల్, బుల్లితెర నటి, నిర్మాతగా రాణించారు. ఉత్తమ నటిగా ఐదుసార్లు ఇండియన్ టెలివిజన్ అకాడమీ అవార్డ్ అందుకున్నారు. హిందీ, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ తదితర భాషలలో మాట్లాడగలరు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్‌ఓ)కు గుడ్‌విల్ అంబాసిడర్‌గా వ్యవహరించారు.

కంగనా రనౌత్ (పుట్టినరోజు)



బాలీవుడ్ నటి 'పద్మశ్రీ' గ్రహీత కంగనా రనౌత్ 1987 మార్చి 23న హిమాచల్‌ప్రదేశ్‌లోని భంబ్లా ప్రాంతంలో జన్మించారు. బాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం అందుకున్న నటిగా గుర్తింపు పొందారు. మూడు జాతీయ పురస్కారాలు, నాలుగు ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు. చిన్నతనంలో డాక్టర్ అవ్వాలని భావించారు. అయితే 16ఏళ్లకు తన కెరీర్ తానే రూపొందించుకోవాలని ఢిల్లీ చేరి మోడల్ అయ్యారు. 2006లో 'గ్యాంగ్‌స్టర్' సినిమాతో తెరంగేట్రం చేశారు. ఫోర్బ్స్ ఇండియా సెలెబ్రిటీ 100లో ఒకరిగా ఆరుసార్లు నిలిచారు.

తాగునీటికోసం స్కైలిన్ కొత్త ప్రయోగం

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నీటి కొరత తీవ్రమవుతున్న తరుణంలో ఆర్గనైజేషన్ డి స్కైలిన్ ఫౌండేషన్ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. క్లౌడ్ చాంబర్ ద్వారా పేటెంట్ పొందిన రెయిన్ టన్నెల్ టెక్నాలజీతో అవసరమైనంత నీటిని పొందవచ్చు. అడ్వాన్స్‌డ్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్‌ను అక్వెరెజియాతో సవాల్‌ను పరిష్కరిస్తుంది. గాలిలోని తేమశాతాన్ని ఆవిరిగా మార్చి శుభ్రమైన తాగునీటిని మలుస్తుంది. దీన్ని రాయల్‌వాటర్‌గా పిలుస్తారు. ఎటువంటి కలుషితం, సాధారణ నీటిపై ఆధారపడకుండా స్వచ్ఛమైన తాగునీటికి ఇదో పరిష్కారం. అక్వెరెజియా మాజీ పరిశోధకుడు రాజా విజయ్ కుమార్ చేసిన శాస్త్రీయ పరిశోధనల్లో ఉంది. కరువు పరిస్థితులు, నీటిభద్రత కోసం గాలి, సూర్యరశ్మి ద్వారా 500-1000 లీటర్ల స్వచ్ఛమైన నీటిని పెద్ద అక్వెరెజియా పరికరాలను స్కైలిన్ రూపొందిస్తోంది. మానవ సమస్యలకు శాస్త్రీయ సాంకేతిక ఆవిష్కరణలతో పరిష్కారం చూడమే స్కైలిన్ లక్ష్యమని రాజా విజయకుమార్ అభిప్రాయపడ్డారు. ఈమేరకు బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది నీటి శుద్ధీకరణ పరికరం కాదని హైపర్‌సోనిక్ విధానంతో ఒక పెట్టెలో సహజ వర్షపునీటిని రూపొందిస్తామన్నారు. మన చుట్టూ ఉండే గాలినుంచి కూడా నీటిని పొందుతున్నామని, నీటి ప్రవాహాలు నదులు, మహాసముద్రాలకంటే ఎక్కువనీరు గాలిలోనే ఉంటుందన్నారు.

ముళబాగిలులో తీవ్రమైన తాగునీటి సమస్య

» పట్టణంలో ఎండిపోయిన 22 బోరుబావులు



అంజనాద్రి సమీపాన గోపాలస్వామి చేదబావి నుంచి నీటిని తీసుకెళ్తున్న మహిళలు

ముళబాగిలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన ముళబాగిలు పట్టణంలో భూగర్భజలాలు అడుగంటడంతో తాగునీటి సమస్య అధికమైంది. మరో 15రోజుల్లో వర్షాలు కురవకుంటే పరిస్థితి మరింత అధికమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎండిపోయిన 22 బోర్లు

పట్టణంలో 154 బోర్లు ఉండగా వీటిలో 22 బోరుబావులు పూర్తిగా ఎండిపోయాయి. మిగిలిన బోర్లలో 1.5 ఇంచీ నీరు లభిస్తోంది. పట్టణంలోని 2, 3, 4, 5, 6, 8, 13, 20, 22, 24, 31 వార్డులలో నీటి సమస్య ఉంది. కాగా గత నెలలో నగరోత్థాన పథకం కింద 15బోర్లు కొత్తగా తవ్వించారు. వీటిలో మూడుబోర్లలో నీరు లేదు. మిగిలిన 12 బోర్లకు ఇంకా పంప్‌సెట్ అమర్చాల్సిఉంది. దీనిపై కంట్రాక్టర్‌ను సంప్రదించగా నగరసభ నుంచి అధికారికంగా జాబితా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో 31 వార్డులకుగాను నీటి సమస్య ఉన్న ప్రాంతాలలో సరఫరా చేసేందుకు కేవలం 2 ట్యాంకర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

ప్రైవేట్ ట్యాంకరు నీరు రూ.600

కొన్ని వార్డులలో భూగర్భజలాలు అడుగంటడంతో ఇతర వార్డులలో ప్రైవేట్ వ్యక్తుల నుంచి ట్యాంకరు నీరు రూ.600గా ఉంది. మరికొంతమంది శివారు ప్రాంతాల బావులనుంచి నీరు తెచ్చుకుంటున్నారు. కొన్ని చోట్ల 1200 అడుగుల మేర తవ్వితేనే బోర్లలో నీరు లభించే పరిస్థితి నెలకొంది. అయితే పట్టణం నుంచి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో బోర్లు తవ్వించగా 600 అడుగులకే నీరు లభిస్తోంది. ఈ అంశంపై నగరసభ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. గత ఆరు నెలలనుంచి సరైన వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. నీటి సమస్య పరిష్కరించేందుకు నగరసభ అధికారులు ప్రత్యామ్నాయ వ్యవస్థకు చర్యలు చేపట్టాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

ముళబాగిలు పట్టణంలోని వార్డులలో అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్టు నగరసభ కమిషనర్ వీ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని ఇప్పటికే 15బోర్లు తవ్వించగా 12లో మాత్రమే నీరు లభ్యమవుతోందన్నారు. వీటికి త్వరలోనే విద్యుత్ కనెక్షన్ ఇస్తామన్నారు. 15వ ఆర్థిక పథకంలో రూ.కోటి విడుదల చేశారని, నీటి ఎద్దడి తలెత్తకుండా సంపూర్ణ చర్యలు చేపడతామన్నారు.



ఇంకా మోటర్‌పంప్‌సెట్ అమర్చని బోరు

కళాశాలలు ఎన్‌బీఏ గుర్తింపునకు సిద్ధం కావాలి

» ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్ధ

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కళాశాలలు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ)లో గుర్తింపు సాధించేదిశగా సిద్ధం కావాలని ఎన్‌బీఏ ఛైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్ధ అభిప్రాయపడ్డారు. శనివారం రామయ్య అప్లైడ్ సైన్స్ యూనివర్సిటీ, వీటీయూల సంయుక్త ఆధ్వర్యంలో అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అండ్ అక్రిడేషన్ పేరిట ప్రత్యేకసభను జరిపారు. వీటీయూ వైస్‌చాన్సలర్ డాక్టర్ విద్యాశంకర్, గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎంఆర్ జయరాం, సలహాదారుడు పీఎస్ రాజదాన్, ఎన్‌బీఏ కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్ నస్త, రామయ్య యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఆర్‌వీ రంగనాథ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహస్రబుద్ధ మాట్లాడుతూ పట్టభద్రులు వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఫలితాలు, సౌలభ్యాల ఆధారంగా ఎన్‌బీఏ గుర్తింపు పొందాలన్నారు. ఉన్నత విద్యాసంస్థల అకడమిక్ పరిశ్రమలకు అనుగుణంగా మలచుకోవాలన్నారు. సాంకేతిక బోధనల ద్వారా గుణాత్మకత పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఏటా 15లక్షలమంది డిగ్రీ పూర్తి చేస్తారని గడిచిన దశాబ్దంలో స్టార్టప్ ఎకో సిస్టమ్ ద్వారా 400 నుంచి 1.7 లక్షలమంది ప్రాజెక్టులను రూపొందించారన్నారు. 1.7 మిలియన్ స్టార్టప్‌లు మరో పదేళ్లలో సాధ్యం కానున్నాయనే విశ్వాసం వ్యక్తం చేశారు. వీటీయూ వీసీ విద్యాశంకర్ మాట్లాడుతూ డ్రైవ్ అకడమిక్ ఎక్సలెన్సీ విధానాన్ని యూనివర్సిటీలో పొందుపరిచామన్నారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్ దిశగా ప్రోత్సహిస్తున్నామన్నారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎంఆర్ జయరాం మాట్లాడుతూ తమ విద్యాసంస్థలలో నైపుణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రగతిపర శిక్షణా విధానాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. సాంకేతిక, ఇండస్ట్రియల్‌కు సంబంధించిన కార్యక్రమాలను పరిచయం చేసేందుకు అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందం చేసుకుంటున్నామన్నారు. ఇది విద్యార్థులు, పరిశ్రమలకు ఉత్తమ ప్రతిక్రియ సాధ్యమైందన్నారు. మార్కెట్‌కు అనుగుణమైన నైపుణ్యతను తీర్చేందుకు నిరంతరంగా సాంకేతిక విధానాలను విద్యార్థులకు కల్పిస్తున్నట్టు తెలిపారు.



ఎన్‌బీఏ ఛైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్ధ తదితరులు

బంద్‌కు మద్దతుగా బీఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ...

మహదేవపుర, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక బంద్‌కు మద్దతుగా ఐటీబీటీ కేంద్రమైన హుడి సహా పలు మార్గాలగుండా కన్నడ నినాదాలు చేస్తూ భారతీయ సేవా సమితి (బీఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. సమితి సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర (హూడి చిన్ని) అధ్యక్షత వహించి మాట్లాడుతూ అనుచితంగా వ్యవహరించిన మరాఠీలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహదాయి - కళసా బండూరి, మేకెదాటు పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కన్నడిగులపై దౌర్జన్యాలను సహించేది లేదని హెచ్చరించారు. నమ్మ మెట్రో నియామకాలలో కన్నడిగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాలకంటే తొలుత కన్నడిగులకోసం రిజర్వేషన్ విధానం అమలు చేయాలన్నారు. బీఎస్‌ఎస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. హూడి, గరుడాచార్‌పాళ్య, కేఆర్ పుర నుంచి ఫ్రీడంపార్కుకు సాగారు. పలు కూడళ్లలో అవాంఛనీయసంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు కల్పించారు.



నినాదాలు చేస్తున్న బీఎస్‌ఎస్ కార్యకర్తలు

తాగునీటిని వృథా చేయరాదు



సీనియర్ సివిల్ న్యాయాధికారి జగదీశ్‌రుద్రె తదితరులు

ముళబాగిలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అమూల్యమైన నీటిని వృథా చేయరాదని పరిమితంగా వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి గౌడ జగదీశ్‌రుద్రె అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ డీవీజీ ప్రాథమిక పాఠశాలలో తాలూకా న్యాయసేవల సమితి, న్యాయవాదుల సంఘం, విద్యాశాఖ సంయుక్తంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రపంచ జల దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. జీవజలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి కర్తవ్యం కావాలన్నారు. నీరు అన్ని జీవులకు ప్రాణాధారమని నీటి ప్రాధాన్యతను గుర్తించి కలుషితం చేయరాదన్నారు. నీటిని కాపాడుకోవడానికి మనం అందరం కృషి చేయాలన్నారు. మొక్కలను పెంచి పర్యావరణానికి చేయూత ఇవ్వాలన్నారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు సీ సొణ్ణప్ప మాట్లాడుతూ 150ఏళ్ల చరిత్ర కలిగిన డీవీజీ నివాసాన్ని ఓసాట్ సంస్థ సహకారంతో రూ.2-3 కోట్లతో నిర్మించినట్టు తెలిపారు. కాగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. తొలుత డీవీజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎంఎస్ శ్రీనివాసరెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎన్ సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సీవీ శ్రీనివాస్, చౌడమ్మ, దీక్ష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక వైద్యసేవలు

బొమ్మనహళ్ళి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బన్నేరుఘట్టరోడ్డులోని అపోలో ఆసుపత్రిలో సీనియర్ ఫస్ట్ అనే కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు ప్రారంభించారు. వృద్ధులకోసం ప్రత్యేక చొరవచూపుతున్న అపోలో ఆసుపత్రి సేవలను మంత్రి కొనియాడారు. వృద్ధులు సలహాలు, చికిత్సలు పొందవచ్చునన్నారు. సమగ్ర సేవలు లభిస్తున్నాయన్నారు. ఆసుపత్రి కార్యనిర్వాహక ఉపాధ్యక్షురాలు ప్రీతారెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజనకోసం ప్రత్యేక సేవలు అందిస్తున్నామని, రాయితీ సదుపాయం ఉందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు జస్టిస్ కృష్ణదీక్షిత్, ఆసుపత్రి ప్రెసిడెంట్ సీఈఓ మధుశశిధర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మంత్రి దినేశ్‌గుండూరావు తదితరులు



వర్షంలో చిన్నారులు ఇలా...

ఎండవేడిమి నుంచి ఉపశమనం

● నగరంలోని పలు ప్రాంతాల్లో చిరు జల్లులు

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు వారాలుగా ఎండవేడిమి అమాంతం పెరిగింది. ఏకంగా 40 డిగ్రీలకుపైగా ఉత్తర కర్ణాటక జిల్లాల్లో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోతతో తల్ల డిల్లుతున్న ప్రజలకు వరుణుడు ఉపశమనం కల్పించాడు. బెంగళూరు తోపాటు వివిధ జిల్లాల్లో శనివారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. మేఖ్రి సర్కిల్, హెబ్బాళ, యలహంకతోపాటు పలు ప్రాంతాల్లో అరగంటపాటు వర్షం కురిసింది. రాత్రి 8గంటల తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం నమోదైంది. చిక్కబళ్లాపుర, కోలారు, హాసన్ సహా వివిధ జిల్లాల్లో వర్షం కురిసింది. వారాంతంలో వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

హంద్రీనీవా కాలువ వెడల్పు చేయాలి

బుక్కపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే నిలిపివేసి, కాలువనువెడల్పు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో హంద్రీనీవా కాలువలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మూడువేల క్యూసెక్కులు ప్రవాహం ఉండేదని, లైనింగ్ పనులు చేస్తే, నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. భూగర్భజలాలు సైతం తగ్గుతాయన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ కాలువలోని పిచ్చి మొక్కలు తొలగించి వెడల్పు చేయాలన్నారు. సత్యసాయి జిల్లాలో అన్ని చెరువులను నీటితో నింపి సాగు, తాగునీటికి ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. లైనింగ్ పనులతో రైతులకు నష్టమేకానీ లాభం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, కాలువను వెడల్పు చేయాలని కోరారు. ఆయనతోపాటు సీఐటీయూ కుళ్లాయప్ప, సిద్ధ పాల్గొన్నారు.

మద్దతుధర కల్పించడంలో విఫలం



సభ్యత్వ నమోదులో రైతుసంఘం ప్రతినిధులు

బాగేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే పంటలకు మద్దతుధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని కర్ణాటక రాష్ట్ర ప్రాంత రైతుసంఘం ఆరోపించింది. సంఘం జిల్లా సంచాలకులు చన్నరాయప్ప నేతృత్వంలో ఎల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గురాలు దిన్నె, నీరిగట్టిపల్లె గ్రామాల పొలాల్లో శనివారం సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా చన్నరాయప్ప మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు, పరిశ్రమల అభివృద్ధి పేరిట భూస్వాధీన ప్రక్రియలో రైతులకు అన్యాయం, అర్జీ 53, 57 లకింద భూమికోసం దాఖలు చేసుకున్నవారికి లభించడం లేదన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం రైతుసంఘాన్ని బలోపేతం చేయదలిచామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డిటి మునిస్వామి, జిల్లా సమితి సభ్యులు కృష్ణప్ప, మద్దిరెడ్డి, కొండారెడ్డి, ఆచేపల్లి లక్ష్మణ్ణ, వెంకటరామిరెడ్డి, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ బాధితులను ఆదుకోండి



వినతి పత్రం అందజేత

శిడ్లఘట్ట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీ నుంచి బయటపడిన వారికి కనీసం 2 ఎకరాల భూమి ఇవ్వాలని, బోరుబావి సదుపాయం కల్పించాలని, అంతర్గత కులవర్గీకరణ చేయాలని కర్ణాటక జీతదాళ, కృషి కూలికార్మికుల ఒక్కూట డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ స్వామికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సంఘానికి చెందిన శ్రీనివాస్ మాట్లాడుతూ పేదరికం కారణంగా వెట్టిచాకిరీకి గురైనవారికి విముక్తి కల్పించారని, అలాగే వారి జీవనోపాధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాలూకాలో సుమారు 150మందికిపైగా ఇలాంటివారు ఉన్నారని వారికి ఎలాంటి సదుపాయాలు అందడం లేదన్నారు. ఈ సందర్భంగా ఒక్కూట పదాధికారులు పాల్గొన్నారు.

అల్యూమినియం తీగల స్వాధీనం




స్వాధీనం చేసుకున్న తీగలు, బైక్‌లతో పోలీసులు

బంగారపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బంగారపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒంబత్తుగుళి, వట్రకుంటె, బావరహళ్ళి, చిక్క అంకండహళ్ళి, తమ్మేనహళ్ళి, దాసరహొసహళ్ళి తదితర గ్రామాల రైతుల పంప్‌సెట్లకు వెళ్లే విద్యుత్ అల్యూమినియం తీగలను చోరీ చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. చోరీలకు సంబంధించి ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్పీ శాంతరాజు, డీఎస్పీ పాండురంగ మార్గదర్శకత్వంలో ఇన్‌స్పెక్టర్ దయానంద్ నేతృత్వంలో పోలీసులు కార్యాచరణ నిర్వహించారు. హుణసనహళ్ళి సమీపాన మాలూరు తాలూకాకు చెందిన సుదర్శన్, మధుసూధన్‌లను అరెస్టు చేశారు. నిందితులనుంచి రూ.2.50 లక్షల విలువైన 532 కేజీల అల్యూమినియం, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యాచరణల పాల్గొన్న సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ధర్మవరం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలంలోని రేగాటిపల్లి గ్రామ పొలాల్లో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆనవాళ్లను బట్టి ధర్మవరం పట్టణంలోని తిక్కస్వామి గుడి సమీపంలో నివసిస్తున్న బ్యాళ్ల అక్కమ్మ (50)గా ఆమెను గుర్తించారు. ఈమెకు చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో చిన్నగంగన్నతో వివాహమై ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే ఈమె కొన్నేళ్ల క్రితం తనకు టుంబసభ్యులతో విడిపోయి ధర్మవరం పట్టణంలోని తిక్కస్వామి సమీపంలో ఒంటరిగా నివసిస్తోంది. ఈ క్రమంలో శనివారం రేగాటిపల్లి గ్రామ పొలాల్లో ఆమె మృతదేహం లభ్యమైంది. డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు ఆమె మృతదేహాన్ని సందర్శించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహంపై వస్త్రాలు లేకపోవడం, తలఅంతా కుళ్లి ఛిద్రం కావడంతో, వారంరోజుల క్రితమే చనిపోయి ఉంటుందని పోలీసులు భావించారు. డ్వాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం ద్వారా పలుకోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1596.61	1,582.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,273	765
నీటి నిల్వ (టీఎంసీలు)	17.46	5.56

హట్టిలో వడగండ్ల వాన



వర్షంలో వడగండ్లు..

రాయచూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని హట్టి బంగారు గనుల పరిసరాల్లో శుక్రవారం రాత్రి సుమారు గంటసేపు వడగండ్ల వానం కురిసింది. గడచిన మూడు రోజులుగా విపరీతమైన ఎండవేడితో అల్లాడిన జనం ఒక్కసారిగా ఆకాశంలో మొబ్బులు రేగి శుక్రవారం రాత్రి దాదాపు గంటసేపు వర్షం కురువడంతో సేదదీరారు. కాగా వడగండ్లను పట్టుకునేందుకు చిన్నారులు, పెద్దలు రోడ్ల పైకి రావడం కనిపించింది. కొత్త బస్‌స్టాండ్ సమీపంలోని క్రీడామైదానం వర్షం తాకిడికి జలమయమైంది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ వాసుకుమార్

కంప్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలో శనివారం తెల్లవారుజామున జరిగన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కంప్లి, బళ్లారి మెట్రి గ్రామ సమీపంలోని సుబ్బమ్మవ్వ మఠం శరణప్ప పొలాల దగ్గర అతనిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. తెల్లవారుజామున వాకింగ్ వెళ్లిన గిరీష్ ప్రమాద విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న సీఐ వాసు కుమార్ అక్కడ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. 30 నుండి 35 సంవత్సరాల వయసు వుండవచ్చు నన్నారు. పోస్టుమార్టమ్ నిమిత్తం కోసం బళ్లారికి తరలించారు. కంప్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అదనపులోడు క్రమబద్ధీకరణ

● విద్యుత్‌శాఖ ఏడీ లక్ష్మీనరసింహారెడ్డి

ధర్మవరంరూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి) :గృహవినియోగదారులకు అదనపులోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి సూచనమేరకు రాష్ట్ర ప్రభుత్వం 50శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ధర్మవరం విద్యుత్‌శాఖ ఏడీ లక్ష్మీనరసింహారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరిగిన విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ, మండలకేంద్రాలు, పట్టణ పరిధిలోని 3కిలోవాట్లకు దరఖాస్తు చేసుకునేలా ముందుగానే సంబంధిత విద్యుత్ అధికారులు వినియోగదారులకు సూచించినట్లు తెలిపారు. అదనపులోడు అంటే కొత్తగా కనెక్షన్ తీసుకునే సమయంలో గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి కిలోవాట్లలో లెక్కిస్తామని తెలిపారు. ఈ మేరకు డెవలప్‌మెంట్ చార్జీలు సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తారన్నారు. గ్రామ, మండల కేంద్రాల్లో కనీసం రెండు సింగల్ వాట్లు, పట్టణాల్లో 3 కిలోవాట్ల ఉంటుందన్నారు. ఈ అవకాశం జూన్30వరకు ప్రభుత్వం కల్పించిందన్నారు. దరఖాస్తు కోసం ఆన్‌లైన్ లేదా విద్యుత్ కార్యాలయాలలో అందుబాటులో ఉంటాయన్నారు.

జిల్లాలో బంద్ పాక్షికం

● యథావిధిగా తిరిగిన బస్సులు
● ఎక్కడికక్కడ నిరసనలను అడ్డుకున్న పోలీసులు



కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న కరవే సభ్యులు



గడిగి చెన్నప్ప సర్కిల్లో బైక్ ర్యాలీ

బళ్లారి సిటీ/రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు కన్నడ సంస్థలు ఇచ్చిన బంద్‌కు జిల్లాలో స్పందన అంతంతే ఉంది. రవాణా, వ్యాపారాలు యథావిధిగా కొనసాగాయి. బంద్ నేపథ్యంలో కరవే శివరామే గౌడ వర్గానికి చెందిన కొంతమంది కార్యకర్తలు బైక్‌లపై నగరంలో తిరుగుతూ బంద్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీని గురించి ఎవరూ పట్టించుకోలేదు. చివరకు గడిగ చెన్నప్ప సర్కిల్ చేరుకుని మరాఠీల ఎంఈఎస్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంఈఎస్ ఒక రాక్షసీ అని బ్యానర్‌కు నిప్పటించి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఎంఈఎస్ దుండగులకు వ్యతిరేకంగా తాము పోరాటం కొనసాగిస్తామని జిల్లాధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. భూమి, నీరు, బాష విషయంలో రాజకీయాలు చేయకూడ దన్నారు. అందరూ కలిసి పోరాడాలన్నారు. బెల్గాంలో కన్నడిగులను అణచివేస్తున్న ఎంఈఎస్ దుండగులను దేశం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీసీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. నగరంలో బస్సులు, దుకాణాలు, సినిమా థియేటర్లు కొనసాగాయి. శనివారం కావడంతో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు యథావిధిగా మూతపడ్డాయి. పాఠశాలలు, కళాశాలల్లో పరీక్షలు యథావిధిగా జరిగాయి. బైక్ ర్యాలీలో సుమారు 500మంది పాల్గొన్నారు. ఈసందర్భంగా కరవే రాజు, డేవిడ్, సూరి, దావూద్, గోపాల్, రవి, మృత్యుంజయ, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాయచూరులో ర్యాలీగా వెళ్తున్న కరవే కార్యకర్తలు

రాయచూరురులో..

రాయచూరు (ఆంధ్రజ్యోతి) : సరిహద్దు ప్రాంతంలో కన్నడిగుల పై మరాఠీలు చేస్తున్న దాడులను నిరశిస్తు కన్నడ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శనివారం నిర్వహించిన రాయచూరు బంద్ ప్రశాంతంగా సాగింది. ఉదయం పలు దుకాణాలు బంద్ పిలుపు మేరకు మూసివేయగా 12 గంటల అనంతరం ఎదావిధిగా తెరుచుకున్నాయి. బంద్‌కు ఉస్మానియ కూరగాయ వ్యాపారులు సంపూర్ణంగా మద్దతునిచ్చిన నేపథ్యంలో కూరగాయల మార్కెట్ పూర్తిగా మూతపడింది. ఆర్టీసీ బస్సు ఎదివిధిగా సంచరించగా ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం జరగలేదు. అదేవిధంగా 'పది' పరీక్షలు నడుస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఆటంకం జరగకుండా బస్సులను పూర్తిస్థాయిలో నడిపారు. మార్కెట్‌లోని మిగితా దుకాణాలు సహితం ఉదయం ఉదయం 11 గంటల నుంచి ఎదావిధిగా పని చేశాయి. ఈ సందర్భంగా మరాఠీలకు వ్యతిరేఖంగా కన్నడ సంఘాల నాయకులు బైక్‌ల పై తిరుగుతూ నినాదాలు చేస్తు బంద్‌కు మద్దతునివాల్సిందిగా ప్రజలను అభ్యర్థించారు.

కంటి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి : కలెక్టర్

రాయచూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానాం నయనం ప్రధానం ఆర్యోక్తిని గుర్తెరిగి ప్రతిఒక్కరు కంటి సంరక్షణకు తొలి ప్రాధాన్యతనివ్వాలని జిల్లాధికారి కే నితీశ్ సూచించారు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న రాయచూరు జిల్లాలో కంటి సమస్యలు రాకుండా ప్రజలు తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. శనివారం నగరంలోని రిమ్స్ ఆస్పత్రిలో వివిధ స్వచ్ఛంద సంస్థల సౌజన్యంతో ఉచిత నేత్ర చికిత్స శిభిరం నిర్వహించారు. శిభిరాన్ని ప్రారంభించిన జిల్లాధికారి అరదుగా నిర్వహించే ఇలాంటి కీలకమైన శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో గడచిన ఆరు నెలలుగా అనేక వైద్యసేవలు మొరుగ్గా కొనసాగుతున్నాయని ఇందులో వైద్యుల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సురేంద్ర బాబు, రిమ్స్,ఒపెక్ ఆస్పత్రుల్లో దొరకుతున్న వైద్యసేవలు తదితర అందుబాటులో ఉన్న నిపుణులైన వైద్యుల వివరాలను ప్రజలకు వివరించారు.



కంటి చికిత్స చేసుకున్న రోగులతో మాట్లాడుతున్న డీసీ నితీశ్

నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

● దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



గతుకుల రోడ్డుపై ఇబ్బంది పడుతున్న వాహనదారులు

బళ్లారి సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని 21వార్డు కేఈబీ సర్కిల్ నుంచి కర్ణాటక గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం వరకు దాదాపు 350 మీటర్ల రోడ్డు విస్తరణ పనులు నత్తనడక సాగుతున్నాయి. పనులను త్వరగా ముగించి ప్రజలకు సమస్యలు లేకుండా చేయాలని సామాజిక కార్యకర్త మేకల ఈశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌హెచ్ 132వ రహదారి దాదాపు 8నెలలుగా నిర్మాణంలో ఉంది కానీ పని ఇంకా పూర్తి కాలేదన్నారు. పనుల కోసం తవ్విన గుంతలు అలానే ఉన్నాయన్నారు. వ్యాపారులకు గిరాకీలు లేవని, ధుమ్ము దూళితో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బసవేశ్వరనగర్ అరకిలోమీర్ వరకు దుమ్మధూళి వ్యాపించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, గొంతు నొప్పి, ఉబ్బసం వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. రోడ్డు ప్రారంభంలో ఉన్న కేఈబీ సర్కిల్ రోడ్డులోకి వాహనాలు ప్రవేశించరాదని, కర్ణాటక గ్రామీణ బ్యాంక్ సమీపంలో ఉన్న ఈరెండు ప్రదేశాల్లో బ్యారికేడ్లు నిర్మించాలని పేర్కొన్నారు. దీనిపై కాంట్రాక్టర్ ప్రభంజన్‌ను విచారించినప్పుడు నిధులు విడుదల కాలేదని అందుకే పని ఆలస్యం అవుతోందన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని జిల్లాకలెక్టర్‌కు, నగర ఎమ్మెల్యే తహసీల్దార్, ఎస్పీ, మేయర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి శ్రీరాములు



ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న మాజీ మంత్రి శ్రీరాములు

బళ్లారి సిటీ,మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరంలో జేడీఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రాత్రి ముస్లింలలుకక ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీరాములు హాజరయ్యారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనహళ్ళి తాయణ్ణ నిర్వహించడం అభినందనీయమన్నారు. పవిత్ర ఖురాన్ మతం పట్ల మంచి భావనను పెంపొందించడంలో ఇఫ్తార్ సహాయపడుతుందన్నారు. ముస్లింల పవిత్ర మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే రాజావెంకటప్ప నాయక్ అన్నారు. పార్టీ ఎల్లప్పుడే లౌకిక సూత్రాలకు కట్టుబడి ఉంటుందన్నారు. మనమందరం మానవత్వం కోసం అందుకే ఈ కార్యక్రమాన్ని సామరస్యం కోసం నిర్వహించాం అని అన్నారు. జేడీయస్ జిల్లాధ్యక్షుడు మీనళ్ళితాయణ్ణ , ఆఫీస్ బేరర్లు, ముస్లీం కమ్యూనిటీ నాయకులు పాల్గొన్నారు.



నగదు, నగలు చూపుతున్న ఆలయ అధికారులు

దుర్గమ్మ హుండీ లెక్కింపు

బళ్లారి సిటీ,మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరప్రజల ఆరాధ్య దైవం కనకదుర్గమ్మ ఆలయంలోని హుండీని శనివారం లెక్కించారు. హుండీలో రూ.74.21లక్షల నగదు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. మొత్తం 11 హుండీల్లో డబ్బు, వెండి, బంగారు ఆభరణాల లెక్కింపు జరిగింది. గత 5నెలలుగా ఉన్న హుండీని లెక్కించారు. ప్రతి సంవత్సరం లాగే సిడీ బండి రథోత్సవం తరువాత లెక్కిస్తారు. 4.526కిలోల వెండి, 136.00 గ్రాముల బంగారు ఆభరణాలు భక్తులు విరాళంగా వేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతప్ప తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ,మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. నీరు ఒకవిలువైన వస్తువు, దీన్ని పొదుపుగా వాడండి అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ వేదిక బళ్లారి జిల్లా యూనిట్‌కు చెందిన రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భూమిపై లభించే నీటిలో 97.5 శాతం సుముద్రాల్లో ఉందని, మిగిలిన 2.5 శాతం మాత్రమే త్రాగడానికి అనుకూలంగా ఉందన్నారు. నీరు అత్యంత పరిమితమైన సహజ వనరులలో ఒకటని, వర్షాలు పడినప్పుడు భూగర్భ జలస్థాయిలను నిర్వహించడానికి కృషి చేయడం మనమందరి బాధ్యత అన్నారు. చిత్రలేఖన పోటీల్లో విజేతలు అక్షయ, శ్రావణి, వైష్ణవి, అనుశ్రీ, వాల్మీకి వైష్ణవిలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు దిల్షాద్ బేగం, చన్నమ్మ, సుమతి, వైశాలి, శ్వేత, ఉమ్మెహాని,శశమ్మ, గురుప్రసాద్,విజయ, విద్యార్థి ప్రతినిధి అనూష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకాచలపతి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

గంగావతి,రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కనకాచలపతి మహారథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం కనకాచలపతి ఆలయంలో పంచామృతాభిషేకం, తులసి అర్చన, రథం ముందు రథంగ్ హోమం, హవన, పూర్ణాహుతి వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఈసందర్భంగా గంగావతి పోలీస్ సబ్ డివిజన్ ఆఫీసర్ సిద్దలింగప్పగౌడ, ఎక్సైజ్ శాఖ గదగ్ డీసీ లక్ష్మీమారుతి నాయక్, ప్రజాప్రతినిధులు,ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా బయల్దేరిన భక్తులు

కంప్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ సందర్భంగా శిరిగేరి నుంచి శ్రీశైలానికి సుమారు వంద మంది భక్తులు పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. శనివారం ఆంధ్ర సరిహద్దులోని వెంకటాపురం చేరుకుని అక్కడి నుంచి పాదయాత్ర చేపట్టి ఏడు కొండలు ఎక్కి భీమ లోయ, కైలాస కొండ ద్వారా శ్రీశైలం వెళ్లనున్నారు. దారిలో సాక్షి అంజనేయుడి దర్శించుకుని శ్రీశైలం చేరుకుంటామని స్త్రీశక్తి బృందానికి చెందిన మహంకాళమ్మ తెలిపారు. ఓం నమఃశివాయ అంటూ భక్తులు తరలివెళ్లారు.

జేజేఎం పనులు త్వరగా పూర్తి చేయాలి

● జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే
● హోక్రాణి తాగునీటి చెరువు పరిశీలన

రాయచూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టిజ జలజీవన్ విషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే ఏర్పాటు చేయాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే అధికారులను గుత్తేదార్‌లను ఆదేశించారు. శనివారం సిరవార తాలూకా హోక్రాణి సమీపంలోని తాగునీటి చెరువును జడ్పీ సీఈఓ పరిశీలించారు. నీటి మట్టాన్ని పరిశీలించిన అధికారి వేసవి అవసరాలకు తగినంతా నీటిని నిల్వ చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అక్కడే ఉన్న నీటి శుద్ధీకరణ ప్లాంట్‌ను పరిశీలించిన సీఈఓ త్వరితగతిన జేజేఎం పనులను సత్వరం పూర్తి చేసి ప్రజలకు తాగునీరందించే ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం హోక్రాణి సమీపంలోని ప్రధాన రహదారి కూలికార్మికులతో మాట్లాడిన జడ్పీ సీఈఓ మహాత్మగాంధి గ్రామీణ ఉపాధిహామి పథకం ద్వార ప్రతి రోజు 100 రోజుల పని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆడ-మగ కార్మికులకు సమాన వేతన వేతనాన్ని 8 గంటల పని కాలానికి సంబంధించి 349 రూపాయిలు చెల్లిస్తామని అర్హులైన ప్రతియొక్కరు తమ పేర్లను గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారితో నమోదు చేసుకోవాలని సూచించారు.



హోక్రాణి తాగునీటి చెరువు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న పాండ్వే

హోసూరు జోన్

గ్రామాల్లో కలెక్టర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా ఊత్తంగర్రై సర్కిల్ తిమ్మాపట్టి పంచాయతీ పరిధిలో కలెక్టర్ దినేశ్‌కుమార్ పర్యటించారు. తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి కింద మేకలు పొందిన మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులను పథకం క్రింద ప్రయోజనాల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా అభివృద్ధి కార్యక్రమ డైరెక్టర్ పెరియస్వామి కూడా వెంట ఉన్నారు. మహిళా స్వయం సహాయక బృందాలు బహుళ వినియోగ గుర్తింపు కార్డులు, గ్రామం, నగర బస్సులలో 25 కిలోల వరకు స్వయం సహాయక బృందాల ఉచిత రవాణా, పంట రుణం, పశువుల రుణం, చిన్న వ్యాపార రుణం, వ్యవస్థాపకత రుణం ద్వారా పొందిన అన్ని రకాల రుణాలు వంటి అనేక పథకాలను అమలు చేశారు. మేకల పెంపకం ఒక అద్భుతమైన జీవనోపాధి అని తక్కువ సమయంలో మంచి లాభాలను పొందేందుకు అవకాశం ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మేకల పెంపకం ఒక గొప్ప పరిశ్రమగా ఉందన్నారు. అర్హులైనవారు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంబరంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

హోసూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్ వార్షికోత్సవం సంబరంగా సాగింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పాఠశాల విద్యార్థులు తిరుక్కురళ్, సంగీత పోటీలు, చిత్రలేఖన పోటీలు తదితర కళారూపాలను ప్రదర్శించారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి సతీష్‌కుమార్, అంజప్ప, సర్కిల్ కార్యదర్శి ఎల్లప్ప, నాన్ ఆర్గనైజర్ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా డిప్యూటీ ఆర్గనైజర్ రజిని, సెందిల్‌కుమార్‌లు పాల్గొని బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, కన్నడ, తమిళం, ఆంగ్లం వంటి మీడియంలలో బోధిస్తుండడంతో అన్ని వర్గాల వారు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించవచ్చునని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అభిప్రాయపడ్డారు.



పండ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆహారశాఖ అధికారి తనిఖీలు

హోసూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): డెంకణీకోట ప్రాంతంలో ఆహార భద్రతా విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పుచ్చకాయలు ఎర్రగా కనిపించేందుకు రసాయనాలు ఇంజెక్టు చేసి విక్రయస్తున్నట్లు తేలింది. హోసూరు ఫుడ్ సేఫ్టీ అధికారి ముత్తుమారియప్పన్, ఇతర మున్సిపల్ అధికారులు నేతృత్వంలోని బృందం కిరాణా దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. పలు చోట్ల మైనం పూసిన యాపిల్స్ విక్రయాలు జరగడం విస్మయానికి గురిచేస్తోంది. యాపిల్స్ అందంగా కనిపించడమే కాకుండా లోపల చెడిపోకుండా ఉండేందుకు మైనపు పూస్తారని, సదరు మైనం జీర్ణం కాకుండా ఉండిపోయి మనిషికి రకరకాల సమస్యలు వస్తాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆపిల్ పైభాగం తీసివేసి తినడం మంచిదని, లేకపోతే కాయను వేడినీళ్లలో కడిగి శుభ్రం చేసిన తర్వాతే తినాలని నిపుణలు అంటున్నారు. మైనపు ఆపిల్స్‌ను అధికారులు పరిశీలించి వ్యాపారులను మందలించారు. అయితే వాటిని విక్రయించే వ్యాపారులు చాలామందికి మైనపు ఆపిల్స్ అని తెలియదని, అటువంటి యాపిల్స్ హోల్‌సేల్ వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతే కాకుండా అలాంటి దుకాణాలకు సీల్ వేస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లమాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో సబ్సిడీ పీవీసీ పైపులు కావలసిన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ శంకర్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. 63 ఎంఎం కలిగిన 37 పైపులు సబ్సిడీతో రూ.7,670, 75 ఎంఎం 36 పైపులు రూ.11,220, 90 ఎంఎం 36 పైపులు రూ.18,060, 110 ఎంఎం 36పైపులు రూ.27,060 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సొమ్మును రైతులు డీడీ రూపంలో చెల్లించాలన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, వన్‌బీ, ఆధార్, బ్యాంక్ ఖాతాను జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.